# వారం రోజుల వ్యవధిలో షార్ నుంచి రెండు రాకెట్ల ప్రయోగం



శ్రీహరికోట (తడ), నవంబర్ 16 ప్రభాతవార్త

శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి వారంరోజుల వ్యవధిలో రెండు రాకెట్ల ప్రయోగానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో ఒకటి భారతీయ తొలి ప్రైవేటు సంస్థ తయారీ రాకెట్ కాగా, మరొకటి భారత శాస్త్రవేత్తలకు ప్రపంచ ఖ్యాతి తీసుకొచ్చిన రాకెట్ కావడం విశేషం. ఈ నెల 18న స్కై రూట్ సంస్థ రూపొందించిన విక్రమ్-ఎస్ రాకెట్‌ను షార్ నుంచి ప్రయోగిస్తున్నారు. ఇక్కడి సౌండింగ్ రాకెట్ కాంప్లెక్స్ నుంచి ఉదయం 11.30 గంటలకు ఈ ప్రయోగం జరపడానికి నిర్ణయించారు. ఈ నెల 26న షార్‌లోని ఫస్ట్ లాంచ్ ప్యాడ్ నుంచి పీఎస్ఎల్‌వీ సీ-54 రాకెట్‌ను ప్రయోగించనున్నారు. ఆ రోజు పగటి పూట 11.57 గంటలకు ఈ రాకెట్‌ను ప్రయోగించే అవకాశం ఉంది. అయితే బంగాళాఖాతంలో ఈ వారంలో రెండు అల్పపీడనాలు ఏర్పడతాయన్న వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో రాకెట్ ప్రయోగాల సమయంలో ఏమైనా మార్పులు ఉండొచ్చని కొందరు అంటున్నారు. ఏదిఏమైనా ఒక్క వారం వ్యవధిలో రెండు విభిన్న రాకెట్ల ప్రయోగాలకు ఇస్రో శాస్త్రవేత్తలు సిద్ధమయ్యారు.



# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త





# యువతలో ఆధ్యాత్మిక చింతన పెరగాలి

## విశాఖ శారద పీఠాధిపతి శ్రీ స్వాత్మానందేంద్రస్వామి



పేదలకు వస్త్రదానం చేస్తున్న విశాఖ శారద పీఠాధిపతి శ్రీ స్వాత్మానందేంద్రస్వామి

కుప్పం, నవంబర్ 16 ప్రభాతవార్త

భారతదేశం కర్మభూమి అని మన దేశం ప్రతి ఒక్కరినీ ఆలింగనం చేసుకునే దేశమని విశాఖ శ్రీ శారద పీఠాధిపతి శ్రీస్వాత్మానందేంద్రస్వామి పేర్కొన్నారు. బుధవారం కుప్పం ఎంఎఫ్‌సి జూనియర్ కాలేజ్‌లో విద్యార్థులనుద్దేశించి స్వామి ప్రసంగించారు. యువతలో ఆధ్యాత్మిక చింత పెరగాలని సూచించారు. ధర్మాన్ని ఆచరించాలని, పరధర్మాన్ని గౌరవించాలన్నారు. మతమార్పిడులకు లోనుకాకూడదన్నారు. విద్యార్థుల్లో ఆధ్యాత్మిక చింత పెరగాల్సి ఉందని కేవలం పరీక్షల సమయంలో మాత్రమే ఆలయాలకు వెళ్లి దేవుడ్ని పూజించక రోజూ పూజించాలన్నారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించకోవాలన్నారు. యువత మేథాశక్తిని పెంపొందించుకోవాలన్నారు. మేథాశక్తి అనేది కేవలం పాశ్చ యువత పక్కదారి పక్కదారి పట్టరాదని సూచించారు. ధర్మాన్ని నాడు మహాభారతంలో కౌరవులు నాశనం చేయాలనుకుంటే శ్రీకృష్ణుడు తన మిత్రుడు అర్జునుడితో కలసి కాపాడారన్నారు. రామాయణంలో శ్రీరాముడికి హనుమంతుడు, హయగ్రీవుడు శిష్యులుగా ఉన్నారన్నారు. ధర్మాన్ని రక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించారు. అనంతరం సాయిమాతా సేవా ట్రస్ట్ అధ్వర్యంలో పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, సాయిమాతా సేవా ట్రస్ట్ జగదీష్‌బాబు, వేదబ్రహ్మశ్రీ బాలసుబ్రమణ్యశాస్త్రి, శ్రీ సోమశేఖరశాస్త్రి, కౌన్సిలర్లు సోమశేఖర్, వేలు, ఎపిసిఎస్‌సి డైరెక్టర్ శ్రీనివాసమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పాతకక్షలతో యువకుడు హత్య

## నలుగురు నిందితులు అరెస్టు

తిరుపతి క్రైం, నవంబర్ 16, ప్రభాతవార్త



పాత కక్షలతో యువకుడిని కత్తితో పొడిచి హత్య చేశారని నిందితులను పోలీసులు బుధవారం అరెస్టు చేసారు. ఎంఆర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో విలేకరుల సమావేశం నిర్వహించి నిందితుల వివరాలను వెస్ట్ డిఎస్పీ నర్సప్ప, సిఐ సురేంద్ర నాథ్ రెడ్డి వెల్లడించారు. మృతుడు వెంకటేష్ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తుంటాడు. మల్లగుంట ఎస్టి కృష్ణారెడ్డి కాలనీలో నివాసం ఉంటున్నాడు. వెంకటేష్ అన్న శ్రీనివాసులుకి మల్లంగుంట హరిజనవాడకు చెందిన విష్ణువర్ధన్ అతని సోదరుడు సాయికుమార్‌తో రెండు సంవత్సరాల క్రితం ఒక శవం అంత్యక్రియలో గొడవలు జరిగాయి. పెద్దలు మధ్యస్థం చేసి ఇరువురిని మందలించారు. అయితే అప్పటి నుంచి వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. వీరిపై ఎంఆర్ పల్లి పోలీస్ స్టేషన్‌లో కేసులు కూడా నమోదయ్యాయి. ఈ నెల 4న విష్ణువర్ధన్, సాయికుమార్, గోపిలు ఎస్టి కృష్ణా రెడ్డి కాలనీలో రోడ్డులో మద్యం సేవిస్తున్నారు. తమ కాలనీలో నడిరోడ్లులో మద్యం చేస్తున్నారని వెంకటేష్ తన సోదరుడు శ్రీనివాసులు వీరిని మందలించారు. ఈ గొడవల నేపథ్యంలో విష్ణువర్ధన్, సాయికుమార్ తండ్రి నారయ్య కాలనీలో మధ్యస్థం మాట్లాడటానికి వెళ్లాడు. పెద్దల సమక్షంలో పంచాయితీ జరుగుతుండగా మృతుడు వెంకటేష్ తమ్ముడు శ్రీనివాసులు, నారయ్యని కొట్టాడు. తండ్రిని కొట్టారని సాయికుమార్, విష్ణువర్ధన్ శ్రీనివాసుని హత్య చేయాలని పథకం పన్నారు. పుత్తూరు నుంచి రెండు కత్తులు కొనుగోలు చేసుకుని తీసుకొచ్చారు. ఈ నెల 6న శ్రీనివాస్‌ని హత్య చేయాలని ఎస్సీ కృష్ణారెడ్డి కాలనీలో శ్రీనివాస్ ఇంటికి వెళ్లారు. వీళ్ల వెళ్లే సమయానికి శ్రీనివాసులు ఇంట్లో లేకపోవడంతో శ్రీనివాస్ రావు భార్యతో గొడవ పెట్టుకున్నారు. సాయికుమార్, విష్ణువర్ధన్లు వారి స్నేహితులు కలిసి వెంకటేష్‌ని కత్తులతో పొడిచి పరారయ్యారు. స్థానికులు గాయపడిన వెంకటేష్‌ను రుయా హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ వెంకటేష్ ఈ నెల 10న మృతి చెందాడు. మృతుడి వదిన చిన్ని ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులు మల్లగుంట హరిజనవాడ చెందిన కుమారుడు విష్ణువర్ధన్ (20), అతని సోదరుడు సాయికుమార్ (20), వేదాంతపురంకు చెందిన గోపి (20), రాజు గృహకల్ప వెంకటాద్రి అపార్ట్మెంట్‌కు చెందిన కృష్ణయ్య (22)లను రేణిగుంట చంద్రగిరి 150 బైపాస్ రోడ్డు, పాతకాల జంక్షన్ వద్ద సిఐ సురేంద్ర నాథ్ రెడ్డి, ఎస్ఐ వినోద్ కుమార్ అరెస్టు చేసారు. నిందితుల వద్ద హత్యకు ఉపయోగించిన రెండుకత్తులు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కి తరలించినట్లు డిఎస్పీ తెలిపారు. గొడవ జరిగిన ఘటనపై నిర్లక్ష్యం వహించిన ఎంఆర్‌పల్లి ఎస్ఐ పుర్య నాయక్‌కి తిరుపతి జిల్లా ఎస్పి పరమేశ్వర్ రెడ్డి చార్జి మెమో ఇచ్చారు.

# ఒక్క రాజధాని వద్దు మూడు రాజధానులు ముద్దు

## శ్రీకాళహస్తిలో భారీ ర్యాలీ

శ్రీకాళహస్తి, నవంబర్ 16 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో వికేంద్రీకరణకు మద్దతుగా భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వికేంద్రీకరణ ద్వారా రాష్ట్రం అభివృద్ధి జరుగుతుందన్నారు. దానివల్ల ప్రాంతీయ అసమానతలు తొలగి రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధి జరుగుతుందని వివరించారు. అయితే ప్రతిపక్షాలు కుచ్చిత మనస్సుతో ఆలోచిస్తున్నారని ధ్వజమెత్తారు. కర్నూల్‌లో హైకోర్టు, న్యాయరాజధాని, విజయవాడలో శాసనసభ, శాసన రాజధాని విశాఖలో పరిపాలనా రాజధానులుగా ఏర్పాటు చేయటం వల్ల పరిపాలన సులభతరమౌతుందన్నారు. మూడు రాజధానులు వల్ల ఆయా ప్రాంతాల్లో మౌళిక సదుపాయాలు మెరుగుపరచటం ద్వారా ఈ ప్రాంతంలో ప్రత్యక్షంగానూ, పరోక్షంగా ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని వివరించారు.

### భారీగా ర్యాలీ

ఒక్క రాజధాని వద్దు: మూడు రాజధానులు ముద్దు'అంటూనినాదాలు చేసుకుంటూ వేలాది మందితో శ్రీకాళహస్తిలో శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి సారథ్యంలో భారీ ఎత్తున ర్యాలి నిర్వహించారు. ర్యాలి నారదపుష్కరిణి వద్ద నుంచి బయలుదేరి వైయస్ఆర్ సర్కిల్ వద్ద వైయస్ఆర్ విగ్రహానికి పూల మాలలు సమర్పించి సినిమావీధి, నగరి వీధి, బజారువీధి, తేరువీధిల మీదుగా ర్యాలి




సాగింది. ఈ ర్యాలిలో ఎంఎల్ఏతో పాటు ఆయన తనయ బియ్యపు పవిత్రారెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్ గుమ్మడి బాలకృష్ణయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ సి.జయగోపాల్, లోకేష్‌యాదవ్, పట్టణ అధ్యక్షుడు పగడాల రాజు, మాజీ మార్కెట్ కమిటి చైర్మెన్ వయ్యాల కృష్ణరెడ్డి, మైనారిటి నాయకులు గోరా, సిరాజ్, కృష్ణ, చింతామణి పాండు, మల్లికార్జున్ గౌడ్, శంకర్‌రెడ్డి, నరసింహారాజు(నంద), రవీంద్రబాబు, మేకల జయరాం, పులి రామచంద్ర, సురేష్, కోళ్ళూరుహరినాయుడు, సునీతసింగ్, నానిలు పాల్గొన్నారు.



# కర్నూలును న్యాయ రాజధానిగా ప్రకటించాలి..!

## విద్యార్థుల మానవ హారంతో హోరెత్తిన చంద్రగిరి

చంద్రగిరి, నవంబర్ 16 ప్రభాతవార్త:

కర్నూలును న్యాయ రాజధానిగా ప్రకటించాలని కోరుతూ విద్యార్థులు మానవ హారంతో హోరెత్తించారు. మూడు రాజధానుల నిర్మాణంతో రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిర్ణయాన్ని సమర్థిస్తూ బుధవారం ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున ర్యాలీగా టవర్ క్లాక్ వద్దకు చేరుకున్నారు. హైదరాబాద్ ఏకైక రాజధానిగా విభజనతో మనకు జరిగిన అన్యాయాన్ని గుర్తుంచుకొని మూడు రాజధానులకే తమ మద్దతు అంటూ నినదించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే మూడు రాజధానులు ఏర్పాటు చేయాల్సిందేనంటూ ముక్తకంఠంతో కోరారు. కావాలి కావాలి న్యాయ రాజధాని కర్నూలు కావాలి అంటూ హోరెత్తించారు.

# పోలీసుల పనితీరు సంతృప్తికరం

## గాజులమండ్యం పోలీస్‌స్టేషన్‌ను డీఐజీ ఆకస్మిక తనిఖీ




రేణిగుంట, నవంబరు 16 ప్రభాతవార్త:

గాజులమండ్యం పోలీస్‌స్టేషన్‌ను అనంతపురం రేంజ్ డీఐజీ రవిప్రకాష్ బుధవారం తిరుపతి ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డితో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెండు గంటల పాటు అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. నేరాలు నియంత్రణ, ప్రమాదాలు జరగకుండా, మద్యం, మాధక ద్రవ్యాల అక్రమ రవాణా, కేసుల పురోగతి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగిన సూచనలు చేశారు. స్పందనలో ఇచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి బాధితులు న్యాయం చేయాలని ఆదేశించారు. విధి నిర్వహణ పట్ల అలసత్వం వహించకూడదని దిగు స్థాయి ఉద్యోగులను హెచ్చరించారు. గాజులమండ్యం పోలీసుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ గతంలో పోల్చుకుంటే ప్రస్తుతం నేరాల శాతం గణనీయంగా తగ్గిందన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. వాటిని ఎలా నివారించాలో తెలియజేశామన్నారు. హిట్ అండ్ రన్‌కేసెస్‌లో ప్రమాదాలు చేసిన వారిని గుర్తించడానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిందిగా సూచించామన్నారు. మహిళా పోలీసుల సహకారంతో టీజింగ్, మహిళలు బాలికలపై జరిగే అఘాయిత్యాలను నివారించాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎర్రచందనం, మద్యం అక్రమ రవాణాపై జాగ్రత్తగా ఉం డాలని పోలీసులను కోరారు. సమావేశంలో డీఎస్పీ రామచంద్ర, రూరల్ సీఐ ఆరోహణరావు, గాజుల మండ్యం ఎస్ఐ ధర్మారెడ్డి, వడమాలపేట ఎస్ఐ రామాంజనేయులు, ఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేలపట్టులో విదేశీ విహంగాల రెక్కల చప్పుళ్లు

## నేలపట్టులో మొదలైన పర్యాటకుల సందడి



దొరవారిసత్రం, నవంబర్ 16 ప్రభాతవార్త

ఆసియా ఖండంలోని విదేశీ విహంగాల సంతానోత్పత్తి కేంద్రంగా భాసిల్లుతున్న నేలపట్టు పక్షుల సంరక్షణ వన్యప్రాణి విభాగంలో విదేశీ విహంగాల రెక్కల చప్పుళ్లు, కేరింతలు మొదలయ్యాయి. నేలపట్టు కేంద్రంలో ఉన్న కడప చెట్లపై విదేశీ విహంగాలు జత కలిసి ప్రేమబంధం ఏర్పరచుకుంటున్నాయి. ఈ ఏడాది ఆశించిన స్థాయి కంటే అధికంగా వర్షాలు కురవడంతో నేలపట్టులోని కడప చెట్లపై వేలాదిగా పక్షులు సంతానోత్పత్తికి బాటలు వేసుకుంటున్నాయి. జత కలిసిన స్వదేశీ, విదేశీ విహంగాలు గూళ్లను ఏర్పాటు చేసుకుంటున్నాయి. నైజీరియా, ఆస్ట్రేలియా, బర్మా, కజిస్తాన్ తదితర దేశాల నుంచి వేల కిలోమీటర్లు విదేశీ విహంగాలు ఎగురుకుంటూ వచ్చి నేలపట్టు పక్షుల కేంద్రానికి వస్తున్నాయి. అనంతరం అక్కడే బంధం ఏర్పరచుకొని పక్షులు జత కలిసి గూళ్ల నిర్మించుకుంటున్నాయి. గుడ్లు పెట్టి, ఆ గుడ్లను పొదిగి పిల్లలను చేసి ఆయా దేశాలకు తిరిగి వెళ్లిపోవడం ఈ విదేశీ విహంగాల జీవన శైలి. దొరవారిసత్రం మండల పరిధిలోని నేలపట్టు గ్రామ సమీపంలో ఉన్న పక్షుల వన్యప్రాణి సంరక్షణ కేంద్రంలో స్వదేశీ, విదేశీ విహంగాలు, జింకల పార్కులు, రామచిలకల గూళ్ల నిర్మాణాలు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఓ వైపు వర్షం కురుస్తుండగానే మరోవైపు పక్షి ప్రేమికుల సందడి కూడా నేలపట్టులో ఎక్కువైంది. నిత్యం పక్షి ప్రేమికులు విదేశీ విహంగాలను వీక్షించడానికి అధిక సంఖ్యలో కేంద్రానికి తరలి వస్తున్నారు.

### నేలపట్టు రారాజుగా గూడబాతు

నేలపట్టులో విడిది చేసే పక్షులలో అతి పెద్ద పక్షి గూడబాతు. ఈ గూడబాతునే నేలపట్టు రారాజుగా పిలుస్తారు. నేలపట్టులోని కడప చెట్లపై గూడబాతులు, నత్తగుల్ల కొంగలు, స్వాతిముక్కు కొంగలు, తెల్ల కంకణాయిలు, నీటికాకులు తదితర జాతుల విదేశీ, స్వదేశీ విహంగాలు వేలసంఖ్యలో విడిది చేస్తున్నాయి.

# రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి

చంద్రగిరి, నవంబర్ 16, ప్రభాతవార్త



(ఫైల్‌ఫోటో)

మండల పరిధిలోని పనపాకం సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి చెందినట్లు సిఐ ఓబులేష్ తెలిపారు. పనపాకం పంచాయతీ, తూర్పుపల్లి గ్రామానికి చెందిన చాకల చిన్నస్వామి కుమారుడు సుబ్రమణ్యం (46). సుబ్రమణ్యం భార్య నాగమణి (43) ఇద్దరు జాతీయ రహ దారిపై ఆటో దిగారు. రోడ్డు దాటుతుండగా చిత్తూరు నుంచి తిరుపతి వైపు వెళుతున్న కారు వేగంగా ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని తిరుపతిలోని నారాయణాద్రి ఆసుపత్రికు తరలించారు. వైద్యచికిత్సలు పొందుతూ ఇద్దరు తుద్విశ్వాసవిడిచారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

# ఉనికి చాటుకుంటారా !?




ప్రభాతవార్త-తిరుపతి:

'ఉరుము ఉరిమి మంగళం మీద పడిందనే"చందంగా చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు సంబంధించి అర్హులైన పట్టభద్రుల ఓటర్లను నమోదు చేయించడంలో అన్ని రాజకీయపార్టీలు విఫలమయ్యాయనే చర్చ సాగుతోంది. దీనికి తగ్గట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఓటర్లుగా పట్టభద్రులు తమ ఓటు హక్కు నమోదు చేయించుకోవడంలో దరఖాస్తులు చేసుకోవడం నత్తనడకన సాగిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. అటు ఆన్‌లైన్‌లో ఇటు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించినా చాలా వరకు పట్టభద్రులు తిరుపతి, చిత్తూరు జిల్లాలో ఆసక్తిచూపలేదనే అధికార వర్గాల సమాచారం. ఇదే సమయంలో రాజకీయ పార్టీలు కూడా ఓటర్లయిన పట్టభద్రుల నుంచి దరఖాస్తులు స్వీకరించడంలో మరీ విఫలమయ్యారనే వ్యాఖ్యలు లేకపోలేదు. గతంలో పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకుని ఉన్నా ఈ సంవత్సరం మళ్ళీ కొత్తగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఎన్నికల సంఘం పేర్కొంది. ఇందుకు తగిన దరఖాస్తులను మండల పరిధిలో తాశీల్దార్‌కార్యాలయాలు, మున్సిపల్ పరిధిలో మున్సిపల్ కార్యాలయాలు, రెవెన్యూ కార్యాలయాలు, నగరపాలకసంస్థ పరిధిలో అన్ని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాలు, రెవెన్యూ కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరించేలా చూశారు. ఇంకా ప్రభుత్వ రంగ సంస్థలు తమతమ కార్యాలయాల్లో పనిచేస్తున్న, కుటుంబసభ్యులైన అర్హులైన గ్రాడ్యుయేట్లను ఓటర్లుగా నమోదు చేయించే దరఖాస్తులను చాలా వరకు ఒక్కసారిగా సమర్పించవచ్చని కూడా వెల్లడించింది, అయితే చాలావరకు అర్హులైన అభ్యర్థులు తమ ఓటును నమోదుచేయించుకునే పరిస్థితిలో ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు సమాచారం. నగర పరిధిలో ఇన్ని తతంగాలు ఉంటే గ్రామీణ, మండలాలల్లో ఉన్న అర్హులైన అభ్యర్థులు కూడా చాలా వరకు తమ ఓటు నమోదు చేసుకునే దరఖాస్తులు సమర్పించలేదనేది ఇప్పుడు వినిపిస్తున్న వ్యాఖ్యలు. ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్లు తమ ఓటు నమోదు చేసుకునేందుకు 7వతేదీ చివరిరోజుగా నిర్ణయించారు. అప్పటిలోపు తమ దరఖాస్తులను ఉపాధ్యాయ, పట్టభద్రులైన యువతీయువకులు నమోదు చేసుకోవాలి. అయితే చాలావరకు ఉదాసీనత వ్యక్తం చేశారనే సమాచారం తెలుస్తోంది. ముఖ్యంగా

### ఎమ్మెల్సీ ఎన్నికలపై అందరి చూపు!!

పట్టభద్రులైన గృహిణులు, బయట ప్రాంతాల్లో ఉన్న యువత ఓటరుగా నమోదు చేసుకోవడంపై అనాసక్తి చూపారనేది స్పష్టమవుతోంది. ఈనెల 7వతేదీ వరకు ఓటరుగా దరఖాస్తులు నమోదు చేసుకున్న వారిలో తిరుపతి జిల్లాలో 7నియోజకవర్గాలపరిధిలో పట్టభద్రుల ఓటర్లకు సంబంధించి 99,051మంది దరఖాస్తులు, ఉపాధ్యాయ ఓటర్లుగా 5,847మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారవర్గాల సమాచారం. ఓటర్లుగా నమోదైన అర్హుల జాబితాకు సంబంధించి క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన శుక్రవారం నాతటికి పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎమ్మెల్సీ ఓటర్లుగా ఆఫ్‌లైన్‌లో, ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించిన వారి అర్హుల దరఖాస్తులను పరిశీలించిన తరువాత జాబితా తయారీ జరుగుతుంది. ఇప్పటికే అర్హులైన వారు ఓటర్లుగా నమోదుకాలేకపోవడంపై తగిన నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. మొత్తంమీద ఓటర్లుగా నమోదు చేయించే ప్రక్రియలోనే ఆయా పార్టీలు కూడా కొంతవరకు నిర్లిప్తత ప్రదర్శించాయనేది చర్చజరుగుతోంది. మరీ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి పట్టభద్రులు, ఉపాధ్యాయ అభ్యర్థుల ఓటింగ్ సరళిపై అన్ని రాజకీయపార్టీలు తమతమ భవితవ్యాన్ని నిర్ధారించుకోనున్నాయి.

# వాడివేడిగా పెరుమాళ్ళపల్లి పంచాయతీ సర్వసభ్య సమావేశం

## -పంచాయతీలోని అన్ని ప్రాంతాలలో అభివృద్ధి జరగాలని వార్డుసభ్యుల డిమాండ్
## -పంచాయతీ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తా : సర్పంచ్ మోహన్‌కుమార్



తిరుపతిరూరల్, నవంబర్ 16 ప్రభాతవార్త: అభివృద్ధి అనేది ఒకే ప్రాంతం లో కేంద్రీకృతం కాకుండా పంచాయతీలోని అన్ని ప్రాంతాలలోసమపాల్లోజరగాలని పెరుమాళ్ళపల్లి గ్రామ పంచాయతీ వార్డులుసభ్యులుకోరారు. పెరుమాళ్ళపల్లిలో ఏడు కాలనీలు ఉన్నాయని, అందులో కొన్ని ప్రాంతాలలో మాత్రమే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, మిగతా ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోవడం లేదని వార్డు సభ్యులు గౌతమి, తిరుమలరెడ్డి, రవిలు వాపోయారు. పెరుమాళ్ళపల్లి గ్రామ పంచాయతీ సర్వసభ్య సమావేశం బుధవారం సర్పంచ్ జోగి మోహన్‌కుమార్ అధ్యక్షతన వాడివేడిగా జరిగింది. పంచాయతీలోని 13వ వార్డు ఆమడదూరంలో ఉందని వార్డు సభ్యుడు తిరుమలరెడ్డి వాపోయారు. కొప్పరవాండ్లపల్లి పారిశుధ్యం దుర్భరంగా ఉందని, అండర్ డ్రైనేజ్ ఏర్పాటు చేయాలని, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని వార్డుసభ్యురాలు గౌతమి డిమాండ్ చేసారు. పంచాయతీలో అభివృద్ధి పనులన్ని ఒకే వ్యక్తి ఏలా కాంట్రాక్టు ఇస్తారని ప్రశ్నించారు. పంచాయతీలో జరుగుతున్న 40 అభివృద్ధి పనులను ఒకే వ్యక్తి కాంట్రాక్టు ఇవ్వడం ఎక్కడిక్కడే నిలిచిపోయి అభివృద్ధి కుంటుబడి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైందన్నారు. పెరుమాళ్ళపల్లి స్మశానానికి సి.సి. రోడ్డు వేయాలని గౌతమి డిమాండ్ చేసారు. పెరుమాళ్ళపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీ చెరువులో రోడ్డు బాగాలేవని, మురికినీటి కాల్వలు ఏర్పాటు చేయాలని వార్డు సభ్యులు రవి కోరారు. వర్షం వస్తే లక్ష్మీ చెరువుకు వెళ్ళాలంటే చాలా ఇబ్బందికరంగా ఉందని, రచ్చబండను పూర్తి చేయాలని కోరారు. పెరుమాళ్ళపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ జోగి మోహన్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహకారంతో పంచాయతీలో దాదాపు 3కోట్ల రుపాయాలతో సి.సి. నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. పంచాయతీలో మౌళిక వసతుల రూపకల్పనతో పాటు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీని దశలవారీగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. సమావేశం లో పంచాయతీ కార్యదర్శి మదుసూధన్, ఉప సర్పంచ్ వెంకటనా రాయణరెడ్డి, వెంకటమునిరెడ్డి, భాను తదితరులు పాల్గొన్నారు.

## చిందేపల్లిలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 16, ప్రభాతవార్త



ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఇళ్ళ నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి అన్నారు. చిందేపల్లి లే అవుట్‌లో జరుగుతున్న ఇళ్ళ నిర్మాణ పనులను బుధవారం కమిషనర్ అనుపమ అంజలి పరిశీలించారు. కమిషనర్ అనుపమ లే అవుట్ ఇన్‌చార్జి డిఈ గోమతితో మాట్లాడుతూ తిరుపతి నగరంలోని అర్హులైన ప్రజలకు నిర్మిస్తున్న ఇళ్ళ నిర్మాణా పనులను అవసరమైన కూలీల సంఖ్యను పెంచడంతో బాటు, పనులకు అవసరమైన ఇటుకలు, ఇసుక, కమ్మి, సిమెంటుకు లోటు రాకుండా ముందే తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదే విధంగా నిర్మాణ పనుల్లో నాణ్యతపై నిరంతరం పర్యవేక్షణ వుండాలని చెబుతూ చిందేపల్లి నిర్మాణాలకు బాధ్యులైన సచివాలయ కార్యదర్శులు నిరంతరం పనులపై దృష్టి సారించాలన్నారు. నిర్మిస్తున్న ఇంటి యజమానులను భాగస్వామ్యం చేస్తూ ఇళ్ళ నిర్మాణ సమయంలో వారు కూడా ఉండేటట్లు చూడాలన్నారు. ప్రభుత్వం ప్రతి ఇంటిని 1,80,000 వేలతో నిర్మించి ఇవ్వడంతో పాటు ప్రతి ఒక్క ఇంటికి అదనంగా వ్యక్తిగత లోన్ సహాయంతో మరో 35 వేల రూపాయలను వారి యొక్క ఇంటి నిర్మాణానికి అదనపు ఖర్చు క్రింద అందిస్తున్న విషయాన్ని ప్రతి ఒక్క లబ్ధిదారులకు వివరించాలని కమిషనర్ అనుపమ అంజలి అన్నారు. ఈ కార్యక్రమంలో చిందేపల్లిలో లే అవుట్ డిఈ గోమతి, అమ్నెటి సెక్రటరీలు పాల్గొన్నారు.

## మూడు రాజధానులు వద్దు అమరావతి ముద్దు

టవర్ క్లాక్ వద్ద తెలుగుతమ్ముళ్ళ ఆందోళన

చంద్రగిరి, నవంబర్ 16 ప్రభాతవార్త:



మూడు రాజధానులు వద్దు అమరావతి ముద్దు అంటూ తెలుగు తమ్ముళ్ళు నినదించారు. స్థానిక టవర్ క్లాక్ వద్ద బుధవారం మూడు రాజధానుల ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండిస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విభజిత ఆంధ్రప్రదేశ్‌లో ఒక్క రాజధాని నిర్మించడానికి ఏళ్ళ తరబడి అష్టకష్టాలు పడుతున్న ముఖ్యమంత్రి మూడు రాజధానులు అంటూ ప్రజలను తప్పుదోపట్టిస్తున్నట్లు దుయ్యబట్టారు. మూడు రాజధానులతో ప్రజలకు, ప్రభుత్వ యంత్రాంగానికి తీవ్ర ఇబ్బందులు తప్పవనీ, అమరావతినే రాజధానిగా కొనసాగించాలన్నారు. టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, టిడిపి పట్టణ అధ్యక్షుడు మండలం లోకేష్ రాయల్, వీరంగారి రమేష్ రెడ్డి, ప్రభాకర్ నాయుడు, అమ్ములు నాగరాజు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## బ్లాక్‌బస్టర్ కార్తికేయ 2 జీ తెలుగులో

తిరుపతి,నవంబర్ 16ప్రభాతవార్త:




నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్ జీ తెలుగు ఛానెల్‌లో ఆది వారం సాయంత్రం బ్లాక్‌బస్టర్ కార్తికేయ 2 చిత్రం ప్రదర్శించబోతోందని ప్రతినిధి తెలిపారు. మైథలాజికల్ యాక్షన్ అడ్వెంచర్ మూవీగా కార్తికేయ 2 ఆదివారం 20వ తేదీ సాయంత్రం6గంటలకుప్రసారమవుతుందనితెలిపారు. ఎప్పటి లాగాఈచిత్రంప్రమోషన్స్ కూడాతనదైనశైలిఉంటుందన్నారు.

## రెవెన్యూ మంత్రికి ఘన సత్కారం

రేణిగుంట, నవంబరు 16 ప్రభాతవార్త:



తిరుపతి జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కార్యవర్గం బుధవారం రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాద్‌రావు, సీసీఎల్ఏసాయిప్రసాద్, అదనపుసీసీఎల్ఏఇంతియాజ్ అహ్మద్ లను ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో రాష్ట్ర రెవెన్యూ అసోసియేషన్ తిరుపతి జిల్లా ప్రెసిడెంట్ ఎస్.శివప్రసాద్, కార్యదర్శి పి.గోపినాథరెడ్డి, కోశాధికారిరూపీ చంద్, ఉపాధ్యక్షులు అన్వర్ బాషా, తిరుపతి డివిజన్ ప్రెసిడెంట్ అశోక్‌రెడ్డి, కోశాధికారి సి.జీవన్, శ్రీకాళహస్తి డివిజన్ కార్యదర్శి ఏ.కె.ప్రేమ్‌కుమార్, సంతోష్, జిల్లా కార్యవర్గ సభ్యులు దిలీప్, శివకు మార్, వసంత్‌రాజ్, వెంకట సుబ్బయ్య, రామచంద్ర, జి.బాబు, లోకేష్ తదితరులు ఉన్నారు.

## వైభవంగా మహా కాళాష్టమి పూజలు

నగరి, నవంబరు 16 ప్రభాతవార్త :



పట్టణ పరిధిలోని కరకంఠేశ్వర స్వామి ఆల యంలో శ్రీ కాళభైరవి మహా కాళాష్టమి యాగ పూజలు బుధవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలోని కాళభైరవ సన్నిధిలో కలశ పూజలు, సహస్ర నామావళి, అష్టోత్తర నామావళి యాగ పూజలు నిర్వహించారు. అనంతరం కాళభైరవ స్వామికి అభిషేక పూజలు నిర్వహించి పుష్పాలతోనూ, వడ మాలతోనూ అలంకరించారు. పూజలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి ఆశీస్సులందుకున్నారు. ఉభయదారులకు ఆలయ నిర్వాహకులు సంకల్ప పూజలు చేసి ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం, ప్రధాన అర్చకులు దుర్గాప్రకాష్, నవీన్‌కుమార్ ఆచార్యులు, విజయ్‌కుమార్, సురేష్‌కుమార్ స్థానిక ఆలయ కమిటీ నిర్వాహకులు, సభ్యులు పాల్గొన్నారు

## ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు తప్పవు : కమిషనర్

నగరి, నవంబరు 16 ప్రభాతవార్త :

ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు తప్పవంటూ మునిసిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి దుకాణాదారులను హెచ్చరించారు. బుధవారం మునిసిపల్ శానిటరీ సెక్రటరీలు ప్రతి దుకాణానికి వెళ్లి స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్, స్వచ్ఛ నగరి స్టిక్కర్లను అతికించారు. ప్లాస్టిక్ వినియోగించరాదని అవగాహన కల్పించారు. దుకాణాల్లో రెండు డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసుకోవాలని తడిచెత్త, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని సూచించారు. 125 మైక్రాన్‌ల కంటే తక్కువ మందం వున్న కవర్లను ప్రభుత్వం నిషేధించిందని తెలిపారు. నిబంధనలు పాటించకపోతే మునిసిపల్ చట్టం ప్రకారం జరిమానా వేస్తామని స్పష్టం చేశారు. జరిమానా వేసినా వాడకం ఆపకపోతే దుకాణాలకు సీల్ వేయడం జరుగుతుందని హెచ్చరించారు.

## పుస్తక పఠనంతోనే మేధాశక్తిని పెంచుకోవచ్చు

శ్రీకాళహస్తిరూరల్, నవంబర్ 16 ప్రభాతవార్త



పుస్తక పఠనంతోనే మేధాశక్తిని పెంచుకోవచ్చని ఏర్పేడు మండలం అంజిమేడు గ్రామపంచాయతీ పోతుమానుగుంట గిరిజన కాలనీ లో ప్రజాప్రగతి ట్రస్టు ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు సాయంత్రం పూట అదనపు తరగతి నిర్వహించి విజ్ఞానం కోసం విద్యార్థులకు గ్రంధాలయ పుస్తకం అందించి మినీ గ్రంధాలయం ఏర్పాటుచేసి బొమ్మలు పుస్తకం కథల పుస్తకాలు, విజ్ఞానం కోసం సైన్సు అభివృద్ధి కోసం పరిసరాల విజ్ఞానం జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు కూడిన మిని గ్రంధాలయం ఏర్పాటు చేసి వారి జ్ఞానం అభివృద్ధి చెందేందుకు గ్రంధాలయాలను ఉపయోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ట్రస్టు ఛైర్మన్ శ్రీనివాసులు, కోఆర్డినేటర్‌చంద్రశేఖర్, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆలయంలో లీకేజీలకు శాశ్వత మరమ్మతులు చేయించండి

శ్రీకాళహస్తి, నవంబర్ 16 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో లీకేజీలకు శాశ్వత మరమ్మత్తులు చేయించాలని ప్రాచీన ఆలయాలను కాపాడాలని హిందూ ధార్మిక మండలి పట్టణ కన్వీనర్ గరికపాటిరమేష్‌బాబు బుధవారం ఆలయ ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులకు వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా గరికపాటిరమేష్‌బాబు మాట్లాడుతూ పురాతన ఆలయాల సంపద శిల్పకళను భావితరాలకు అందించాలని, శ్రీకాళహస్తీ శ్వరాలయం చిన్నపాటి వర్షాలకే ఆలయంలోకి నీరు లోపలకి చేరి సరస్సులను తలపిస్తోందన్నారు. గతంలో లక్షల రూపాయల ఖర్చుతో అనేకసార్లు మరమ్మత్తులు చేస్తూన్నా లీకేజీలను అరికట్టలే కపోతున్నారన్నారు. ముఖ్యంగా కార్తీకమాసంలో వర్షాలు ఎక్కువగా పడుతుంటాయని వేలసంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేస్తుంటారి వర్షపునీటితో నానిన మండపాల వల్ల భక్తులకు ప్రమాదాలు సంభవిస్తే తీవ్ర నష్టానికి గురయ్యేప్రమాదంఉందన్నారు. ఇలాంటి పరిస్థితులు ఎదురుకాకమునుపే త్వరితగతిన పనులు ప్రారంభించాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో సభ్యులు వాసుయాదవ్, డిల్లీకుమార్ తదితరులు ఉన్నారు.

## శబరిమలై యాత్రకు తిరుచానూరు సర్పంచ్ బృందం

తిరుచానూరు,నవంబర్ 16 ప్రభాతవార్త:



తిరుచానూరులోని అయ్యప్పస్వామి ఆలయంలో తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి బృందం బుధ వారం ఇరుముడి కట్టుకుని శబరిమలై యాత్రకు బుధవారం బయలుదేరారు.ప్రతి ఏటా కార్తీకమాసంలో తన అనుచరులు సుమారు 30 మందితో సామూహికంగా దీక్ష చేపట్టడం ఆనవాయితీగావస్తోంది. ఇందులో భాగంగా తన నివాసం వద్ద అయ్యప్ప భక్తులతో విశేష భజనలు,పూజ,అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు. ఈకార్యక్రమంలోసర్పంచ్‌కుటుంబసభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## డిపోల అలాట్‌మెంట్‌కు 19న హాజరుకండి

-అప్రెంటిస్‌షిప్‌కు ఎంపికైన అభ్యర్థులకు డిపిటిఓ పిలుపు

తిరుపతి ప్రెస్‌క్లబ్,నవంబర్ 16 ప్రభాతవార్త:

ఏపిఎస్ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ చేయడానికి నెల్లూరు జోనల్ ట్రైనింగ్ కళాశాలలో ఉత్తీర్ణత సాధించిన ఐటిఐ అభ్యర్థులు జిల్లాలోని ఖాళీగా ఉన్న వివిధ డిపోలలో శిక్షణ పొందటానికి డిపోల అలాట్‌మెంట్ కోసంఈనెల 19వ తేదీ శనివారం వారి గుర్తింపు పత్రాలతో తిరుపతి ప్రాంతీయ అధికారి కార్యాలయంలో హాజరు కావాలని ప్రాంతీయ అధికారి తిమ్మాడి చెంగల్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఇందులో డీజిల్ మెకానిక్‌లు 56 మంది,మోటార్ మెకానిక్ ఒక్కరు,ఎలక్ట్రీషియన్లు 8 మంది,వెల్డర్ ఒక్కరు,ఫిట్టర్ ఒక్కరు,డ్రాఫ్ట్ మాన్(సివిల్) ఒక్కరితో కలిపి మొత్తం 68 మంది ఐటిఐ అభ్యర్థులు 19న ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు.వారికి డిపోల వారీగా కేటాయించడం జరుగుతుందని పేర్కొన్నారు.

## రోడ్లపై పశువులు: పేడలతో తిప్పలు

కమిషనర్‌కు ఫిర్యాదు

శ్రీకాళహస్తి,నవంబర్ 16 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలోని హరహరబావి పరిసరాల్లో పశువుల పెంపకందార్లు విచ్చలవిడిగా బర్రెలను పెంచి వాటిని విచ్చల విడిగా రోడ్లు మీద వదలిపెట్టటంతో పాదచారులు, ద్విచక్రవాహ నదారులకు ఇబ్బందిగా మారిందని వైకాపా నాయకులు కోళ్ళూరు హరినాథ్‌నాయుడు మున్సిపల్ కమిషనర్ బి.బాలాజి నాయక్‌కు బుధవారం వినతి పత్రం అందించారు. హర హర బావి మున్సిపల్ పాఠశాల నుంచి తూర్పున ఉన్న కాలనీ రోడ్లమీద పశువులను పెంపకం దార్లు వదలి పెట్టడంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని వివరించారు.గతంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ మేస్త్రీలకు ఫిర్యాదు చేస్తే వారం రోజులు కట్టడి చేసారని ప్రస్తుతం మళ్ళీ యథాతధంగా మారిందని వివరించారు.పశువులు రోడ్ల మీద పేడ వేయటంతో కొందరు వృద్ధులు జారి పడి ఇబ్బంది పడుతున్నారని వివరించారు.ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని రోడ్లను శుభ్రంగా ఉంచాలని హరినాయుడు కోరారు.హరినాయుడుతో పాటు మెగరాల గణేష్, సెన్నిరుకుప్పం శేఖర్‌లు పాల్గొన్నారు.

## శివయ్య సన్నిధిలో సూళ్ళూరుపేట మున్సిపల్ ఛైర్మన్

శ్రీకాళహస్తి, నవంబర్ 16 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి బుధవారం సూళ్ళూరుపేట మున్సిపల్ ఛైర్మన్ శ్రీమంత్ రెడ్డి కుటుంబ సమేతంగా విచ్చేశారు. ఈసందర్భంగా వీరికి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరు తారకశ్రీనివాసులు స్వాగతం పలికి ప్రత్యేకంగా స్వామిఅమ్మవార్ల దర్శనం ఏర్పాట్లు చేపట్టారు. ఆలయంలోని స్వామిఅమ్మవార్ల దర్శనంతో పాటు ప్రత్యేకపూజలు నిర్వహించుకున్నారు. అనంతరం వీరికి ఆలయం వెలుపల ఉన్న ధ్వజస్తంభం వద్ద శేషవస్త్రాలతో సత్కరించి స్వామిఅమ్మవార్ల చిత్రపటాన్ని మరియు తీర్థప్రసాదాలను అందజేశారు.

## పుష్కరిణిలో రాజకీయ సభలేంటి

శ్రీకాళహస్తి, నవంబర్ 16 ప్రభాతవార్త

దక్షిణకైలాసంగా పేరుగాంచిన వాయులింగేశ్వర క్షేత్రంలో పవిత్రమైన కార్తీకమాసంలో శివనామ్మరణతో మారుమ్రోగాల్సిన పవిత్రనారదపుష్కరి ణిలో మహిళా భక్తుల దీపాలతో దేదీప్యమానంగా వెలగాల్సిన పుష్కరిణిలో శివనామస్మరణకు బదులు మధునామ స్మరణాలుజరగడం భక్తుల మనోభా వాలు దెబ్బతినేలా ఉన్నాయని తిరుపతి పార్లమెంటు మహిళా తెలుగుదేశంపార్టీ అధ్యక్షురాలు చక్రాల.ఉష ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పవిత్ర కోనేరులో ఓంకారనాధాలతో ఉండాల్సిన పుష్కరిణిలో వైకాపా రంగులో ఉన్న బెలూళ్ళను, చుట్టుపక్కల జెండాలను కట్టడం దేవాదాయశాఖ నిబంధనలకు విరుద్ధమన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ఇఓపై చర్యలుతీసుకుని పుణ్యక్షేత్రం పవిత్రతను కాపాడాలని డిమాండ్ చేశారు. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత హిందూ క్షేత్రాల పవిత్రతను పూర్తిగా మంటక లుపుతున్నారని ఆమె ఆరోపించారు. పవిత్ర కార్తీకమాసంలో నారదపుష్కరిణిలో మూడు రాజధానులకు అనుకూలంగా సభ నిర్వహించిన ఎంఎల్ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డిపై చట్టపరంగా చర్యలుతీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

## ఉచితంగా మందులు పంపిణీ

తొట్టంబేడు, నవంబర్ 16 ప్రభాతవార్త



మండలంలోని ఇలగనూరు గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య మూత్రపిండాల వ్యాధితో బాధపడుతుం డడంతో అతనికి ఐదు నెలలకు అవసరమైన మందులను ఎంఎల్ఏ బియ్యపుమధు సూధన్‌రెడ్డి ద్వారా నందమెడికల్స్ అధినేత నరసింహులు అందించారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో జీవనం గడపడమే కష్టంగా ఉన్న పరిస్థితుల్లో వ్యక్తి ఆర్థిక పరిస్థితి గమనించి ఆతనికి ఐదు నెలలకు సరిపడా మందులను అందించడం నరసింహులు సేవానిరతికి నిదర్శనం అని అభినందించారు. అనంతరం వెంకటసుబ్బయ్య కూడా సంతోషం వ్యక్తం చేశారు.

## పాముకాటుకు గురైన దేశంనాయకుడికి పరామర్శ

తొట్టంబేడు, నవంబర్ 16 ప్రభాతవార్త

మండలంలోని బంగారమ్మ కాలనీకి చెందిన తెలుగుదేశంపార్టీ నాయకుడు చీరలవెంకటమునిరెడ్డి వ్యవసాయ పనుల నిమిత్తం తమ తోటలో పురుగుమందులు పిచికారి చేయించే మందుపురుగును చూడాలని ఉద్దేశ్యంతో వ్యవసాయాధికారి సలహామేరకు పురుగును చూడాలనిచెట్లను పరిశీలిస్తుండగా పాముకాటుకు గురై వ్యవసాయ పొలంలో పడిపోగా అక్కడే తోటలో పనిచేస్తున్న గిరిజనులు వెంటనే ఆయన ప్రాణాలు కాపాడేందుకు చెక్కల మందు తాగించి వెంటనే ఏరియా ఆస్పత్రికి తరలించగా ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డారు.అనంతరం రేణిగుంటలోని బషీర్ ఆస్పత్రికి తరలించగా అక్కడకు వెళ్లి వెంకటమునిరెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు రైతు ఉపాధ్యక్షులు ప్రకాష్‌నాయుడు, మాజీ సర్పంచ్ మధునాయుడు, వాణిజ్య విభాగం నాయకులు కమలాకర్‌నాయుడు, వ్యాపారవేత్త సునీల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దుకాణాల్లో జరిగే అక్రమాలను అరికట్టండి

శ్రీకాళహస్తి, నవంబర్ 16 ప్రభాతవార్త



పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో వివిధ రకాల దుకాణాల్లో జరిగే అక్రమ లను అరికట్టాలని జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ ఏపి డిప్యూటీ ఛైర్మన్ వై.కోటేశ్వరబాబు కోరారు. ఈమేరకు ఆయన బుధవారం తిరుపతి కలెక్టరేట్‌లోని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ జగదీష్‌రాజును మర్యాద పూర్వకంగా కలిసి శ్రీకాళహస్తీశ్వరస్వామి శేషవస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందించారు. ఈసందర్భంగా కోటేశ్వరబాబు మాట్లాడు తూ శ్రీకాళహస్తిలో తినుబండారాల విషయంలో దుకాణదారులు నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదన్నారు. బేకరీలు, హోటళ్ళు అపరిశుభ్రంగా ఉన్నాయని ధరలు తెలియజేసే పట్టిక కూడా ఏర్పాటు చేయడం లేదన్నారు. కొందరు దుకాణదారులు అధిక ధరలకు విక్రయిస్తూ వినియోగదారులను దోచుకుంటున్నారని కోటేశ్వరబాబు ఫుడ్ఇన్‌స్పెక్టర్ జగదీష్‌రాజుకు వివరించారు. దీనిపై ఫుడ్ఇన్‌స్పెక్టర్ సానుకూలంగా స్పందించారని ఎన్‌సిఆర్‌సి విజ్ఞప్తి మేరకు తాను తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తామని నిబంధనలు పాటించని వారిపై చట్టపరంగా చర్యలుతీసుకుంటామన్నారు.

# తిరుపతి డివిజన్

## పూర్వ విద్యార్థినుల సమ్మేళనం

తిరుపతి (విద్య), నవంబర్ 16, ప్రభాతవార్త



శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తిరుపతి డిపార్టుమెంట్ ఆఫ్ అప్లైడ్ మైక్రోబయాలజీలో పూర్వ విద్యార్థినుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణా నుంచి పూర్వ విద్యార్థినులు తమకు విద్య బుద్ధలు నేర్పినంటు వంటి ఆచార్యులను ఆనందంతో కలవడం జరిగింది. అలాగే వారితో పాటు కలిసి చదువుకున్న స్నేహితులను కలుసుకోవడం, వారు కొలువు దీరినటువంటి ఉద్యోగుల గురించి చర్చించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెడ్‌ఆఫ్ ది డిపార్ట్మెంట్ ఆచార్య చంఞ కుమారి మాట్లాడుతూ ఎంతో వ్యయ ప్రయాసలతో ఇక్కడికి విచ్చేసిన వారందరినీ ఆనందించారు. ఆచార్య సువర్ణ, డాక్టర్ జయమధురి, డాక్టర్ వాని, డాక్టర్ జ్ఞానేశ్వరి, డాక్టర్ కె. రుక్మిణి, ఎమెస్ లేఖరాణి, అధ్యాపకేతరులు పాల్గొన్నారు.

## అగ్నిపత్ పథకం ద్వారా ఇండియన్ ఎయిర్ పోర్సులో

ఉద్యోగ నియామకాల కోసం దరఖాస్తులు, సెట్విన్ సిఈఓ డా. మురళీ కృష్ణ

తిరుపతి (క్రీడ), నవంబర్ 16 ప్రభాతవార్త

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా యువజన సర్వీసుల శాఖ సెట్విన్ వారు ఇంఇయన్ ఎయిర్ పోర్సులో అగ్నిపత్ పథకంలో ఉద్యోగంలో చేరుటకు యువత నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విన్ సిఈఓ డా. మురళీ కృష్ణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఇటీవల భారత సాయుధ దళాలలో కొత్త హెచ్ఆర్ మెథడాలజీని ప్రవేశపెట్టింది అంటే అగ్నిపత్ పథకం అని అన్నారు. భారత వైమానిక దళంలో ఈ పథకం కింద ఎంపికైన అభ్యర్థులు అగ్ని వీర్వాయుడిగా పెర్కొనబడుతారు. నాలుగు సంవత్సరాల పాటు దేశానికి సేవ చేస్తారు. అందులో చేరేందుకు భాగంగా భారత వైమానిక దళం అగ్ని వీర్వాయుగా భారతీయ వైమానిక దళంలో చేరేందుకు స్త్రీ, పురుషుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తోందని దరఖాస్తు నమోదు చేసుకోవడానికి వెబ్‌సైట్‌లో ఈ నెల 23వ తేది లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా కోరారు.

## శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల

విద్యార్థినులకు ద్వితీయ బహుమతి

తిరుపతి విద్య, నవంబర్ 16, ప్రభాతవార్త



జిల్లా స్థాయి యువజనోత్సవాల పోటీల్లో శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులకు ద్వితీయ బహుమతి కైవసం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యం లో నిర్వహించినటువంటి జిల్లా స్థాయి యువజనోత్సవాలలో భాగంగా తిరుపతి ఎస్‌వి మ్యూజిక్, నృత్య కళాశాల వేదికగా నిర్వహించారు. ఈ పోటీలలో శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు ఫోక్ డాన్స్ (జానపద కళానృత్యం) విభాగంలో ద్వితీయ బహుమతిని సాధించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన యువజనోత్సవాల ముఖ్య కార్యనిర్వహణ అధికారి డాక్టర్ వి. మురళీకృష్ణ గెలుపొందిన విద్యార్థుల్ని అభినందించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థుల్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. భువనేశ్వరి దేవి అభినందించి, చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు శిక్షణ ఇప్పించిన కళాశాల అదనపు సాంస్కృతిక విభాగపు అధ్యాపకులైన విజయ, సుజా తలను ప్రిన్సిపాల్ అభినందించారు. అధ్యాపక బృందమంతా విద్యార్థుల్ని అభినందించారు.

## ఎవరికి కష్టం వచ్చినా ఎమ్మెల్యే ఉన్నాడు - ఆకర్షరెడ్డి

రేణిగుంట, నవంబరు 16 ప్రభాతవార్త:



నియోజకవర్గంలో ఎవరికి ఎలాంటి కష్టం వచ్చినా ఆదుకోవడానికి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఉన్నారని ఆయన తనయుడు ఆకర్షరెడ్డి అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ తారకరామ నగర్‌లో అనారోగ్యంతో మృతి చెందిన విజయకుమార్ కుటుంబానికి అంతిమ సంస్కారాల కోసం బుధ వారం ఎమ్మెల్యే సమకూర్చిన 20 వేల రూపాయల నగదును ఆయన కుమారుడు ఆకర్షరెడ్డి మన్యం సురేష్‌రెడ్డి(ఎం ఎస్ ఆర్) సమక్షంలో అందజేశారు. ముందుగా మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి నగదును అందజేశారు. నియోజకవర్గంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా ఆదుకోవడానికి ఎమ్మెల్యే సిద్ధంగా ఉన్నారన్నారు.

## అధ్యక్షుడిగా శ్యామ్, కార్యదర్శిగా సెల్వరాజ్ ఏకగ్రీవం

రేణిగుంట, నవంబరు 16 ప్రభాతవార్త:



కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) మండల మహాసభ బుధవారం రేణిగుంటలోని స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సెల్వరాజ్ అధ్యక్షతన జరిగింది. రేణిగుంట మండలంలో హరిజన, గిరిజన వాడల్లో అగ్రవర్ణాల పెత్తం దారులు దాడులు చిన్న పిల్లలు, మహిళలపై అత్యాచారాలు, కుల వివక్షతకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలపైన సమీక్ష జరిగింది. అనంతరం కేవీపీఎస్ రేణిగుంట మండల కమిటీని 13 మందితో ఏకగ్రీవం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్యామ్, ఉపాధ్యక్షులు ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా సెల్వరాజ్, సహాయ కార్యదర్శిగా సుభాష్, కోశాధికారిగా చీరాలయ్య(యశ్వంత్) కమిటీ సభ్యులుగా వేణు, రేనయ్య, కుమార్; మునిరాజమ్మ, కళావతి, శిరీష, కుమార్ రాజా నూతనంగా ఎన్నికయ్యారు. కేవీపీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో భవిష్యత్ కార్యాచరణపైన తీర్మానాలు చేశారు.

## విద్యకు పెద్దపీట

వేపగుంట ఉన్నత పాఠశాలకు రూ.1.7 కోట్లు మంజూరు , మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్ భూమిపూజ

పుత్తూరురూరల్, నవంబరు 16 ప్రభాతవార్త:



వైసీపీ పార్టీ వైద్య, విద్యకు పెద్దపీట వేస్తున్నాయని మంత్రి రోజా సోదరుడు రామ్‌ప్రసాద్ అన్నారు. పుత్తూరు రూరల్ మండలం వేపగుంట జడ్పీటీసీ పాఠశాలలో అదనపు భవనం నిర్మాణం కోసం నాడు–నేడు కింద రూ.1.7 కోట్ల నిధులు మంజూరైంది. బుధవారం మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పార్టీలు, కులాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తోందన్నారు. అలాగే వైద్య, విద్యకు మొదటి ప్రాధాన్య ఇస్తూ ముందుగా సాగుతున్నాయన్నారు. కార్పొరేట్ విద్యకు సమానంగా ప్రభుత్వం పాఠశాలల్లో విద్యను అందిస్తున్నారని, పాఠశాలలో ప్రతి విద్యార్థికి బెంచ్, డిజిటల్ విద్యను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ భాస్కర్ యాదవ్, అడ్వికేట్‌రవీంద్ర, సర్పంచ్ గిరిజప్రసాద్, సీనియర్ నాయకుడు సుబ్బరామయ్య, పాఠశాల కమిటీ ఛైర్మన్ నరసింహులు, ఎంపీడీవో ఇందిరమ్మ, ఎంఈవో తిరుమలరాజు, పాఠశాల హెచ్‌ఎం రాజారాం, ఈఏసునీత, నాయకులుసుదర్శనం, ఉపాధ్యాయులుహరిత, చూడామణి, కుప్ప య్య, గోపినాథ్, సూర్యనారాయణ, జయచంద్ర, లత, సుకుమారి, పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి పరీక్షకు ముగ్గురు విద్యార్థులు ఎంపిక

పుత్తూరురూరల్, నవంబరు 16 ప్రభాతవార్త:



గేటు పుత్తూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు కౌశల్ టాలెంట్ పరీక్షకు జిల్లా స్థాయిలో ఎంపిక కాయ్యరు. 8వ తరగతి చదువుతున్న వి.హేమజయ, 9వ తరగతి పి.మాధవి, 10వ తరగతి చదువుతున్న బి.మనోజ్‌లు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రవి తెలియజేశారు. ఈ విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.భారతి, జయభారతి, వెంకటరమణ, కుమార్, సీఆర్పీ జగ్గారావు పాల్గొన్నారు.

## ప్రతిభను వెలికి తీయడానికి క్రీడలు దోహదపడతాయి

వెదురుకుప్పం, నవంబర్ 16 ప్రభాతవార్త :




విద్యార్థులలో దాగిఉన్న ప్రతిభ పాటవాలను వెలికి తీయడానికి క్రీడలు చక్కగా దోహదపడతాయని వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకర్‌రావు అన్నారు. కళాశాలలో బుధవారం ఇండక్షన్ కార్యక్రమం నిర్వహించారు. అందులో మొదటి సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు శారీరక, మానసిన వికాసం పెంచడానికి తోడ్పడుతాయన్నారు. క్రీడలలో చురుకుగా పాల్గొనే విద్యార్థులు శారీరక ధృడత్వంతో పాటు మాసిన వికాసం కలుగుతుందని, దీంతో విద్యాభివృద్ధిలోనూ చక్కటి ప్రతిభ చూపుతారని చెప్పారు. పాఠ్యాంశాలలో మార్కులు సాధించడంతో పాటు ఇంటర్నల్ మార్కులు సాధించడంపై విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. క్రీడలలో చక్కగా రాణించడం వల్ల రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తుందని ఆటలపై దృష్టి పెట్టాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుకుని తల్లిదండ్రులకు, కళాశాలకు, అధ్యాపకులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకురాలు లక్ష్మీప్రసన్నలత, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ నాగేశ్వరరావు, ఐక్యూ ఏసి కోఆర్డినేటర్ వెంకటేష్, ఎస్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మంగళగౌరి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 20న సీనియర్ వాలీబాల్ జట్లు ఎంపిక

బంగారుపాళ్యం, నవంబర్ 16 ప్రభాతవార్త:

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 20వ తేదీ ఆదివారం ఉదయం జిల్లా సీనియర్ మహిళ, పురుషుల వాలీబాల్ జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తులసీరెడ్డి, కృష్ణారెడ్డిలు తెలిపారు. జట్ల ఎంపిక నందు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని క్రీడాకారులు ఈ ఎంపికలో పాల్గొనాలని కోరారు. ఎంపికైన జిల్లా జట్లు డిసెంబర్ 8వ తేదీ పశ్చిమ గోదావరి జిల్లా పాల కోడేరు నందు జరిగే రాష్ట్ర అంతర జిల్లాల వాలీబాల్ పోటీల్లో పాల్గొంటాయన్నారు. వివరాలకు 94413 92407 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

## ఘనంగా ప్రపంచ దీర్ఘ కాలిక... ఊపిరితిత్తుల వ్యాధి దినోత్సవం



తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 16, ప్రభాతవార్త బి ఎస్వీ వైద్య కళాశాల రూయ ఆసుపత్రి శ్వాసకోశ వ్యాధి విభాగంలో ప్రపంచ దీర్ఘ కాలిక ఊపిరితిత్తుల వ్యాధి దినోత్సవంను పురస్కరించుకుని భువన విజయం ఆడిటోరియం, ఎస్వి వైద్య కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. చంద్రశేఖరన్ ఆధ్వర్యంలో శ్వాసకోశ వ్యాధులు విభాగాధిపతి డా. సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సదస్సుకి ముఖ్య అతిధిగా తిరుపతి శాసన సభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి, గౌరవ అతిధులుగా నగర మేయర్ డా. శిరీష, టిటిడి పాలక మండలి సభ్యులు పోకల అశోక్ కుమార్, ఫౌండర్ ప్రెసిడెంట్ ఆఫ్ పలమోనాలజీ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ పుల్మనాలోజిస్ట్ ప్రేమ నంద, రూయ ఇంచార్జ్ సూపరింటెండెంట్ డా. నాగేశ్వర్ రావు, జిల్లా వైద్య అధికారి డా. శ్రీహరి రూయ ఇంచార్జి సిఎస్ఆర్ఎంఒ, డా. దేవి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిధ భూమన కరుణాకర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించి ఉపన్యాసించారు. పొగత్రాగు అలవాటు, బానిసలు అయిన ప్రతి ఒక్కరు ఈ అలవాటు మానుకొని ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. కర్మాగారాలలో పనిచేయు వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, వాయు కాలుష్యము నివారణలో ప్రతి ఒక్కరు పాటు పడాలని సూచించారు. తిరుపతి సిటీ మేయర్ డా. శిరిష వైద్యులు సూచనలు పాటించి ఊపిరితీత్తులను సంరక్షించుకోవాలని తెలిపారు. పోకళ అశోకకుమార్ మాట్లాడుతూ వ్యాయామంతో ఊపిరితిత్తుల సామర్థ్యం, ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని తెలిపారు. అనతరం జరిగిన వైద్య సదస్సులో సామాజిక వైద్య విద్య విభాగాధిపతి డా. రవిప్రభూ వ్యాధి కారణాలు నివారణ మార్గాలు వివరించారు. ఈ కార్యక్రమంలో పొగత్రాగుటకు బానిసలైన వారికి కౌన్సిలింగ్ సైకియాట్రీ విభాగం ఆధ్వర్యంలో డిఎడిక్షన్ సెంటర్ నిర్వహించారు. అమర్ రాజా బ్యాటరీ సేఫ్టీ ఆఫీసర్ సురేష్, 60 మంది ఎంప్లాయిస్, ఎలక్ట్రాస్టీల్ ఇండస్ట్రీ, శ్రీకాళహస్తి తిరుపతి పురపాలక వైద్య అధికారి డాక్టర్ హరికృష్ణ, 50 మంది ఎంప్లాయిస్, శ్రీహరి ఇండస్ట్రీ అధినేత రాజేంద్ర శెట్టి, ఇండస్ట్రీ ఎంప్లాయిస్‌కి పిడిఎఫ్ పరీక్షలు, చికిత్స నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రటరీ జయరాం రమేష్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ మునికృష్ణ నాయుడు, ప్రొఫెసర్ డా. భరత్, డా. అనుపమ, ఉదయకిరణ్ పిజి వైద్య విద్యార్థులు, ఎస్వి వైద్య కళాశాల పిఆర్ఓ వీరకిరణ్ పాల్గొన్నారు.

## డిఎల్‌డిఓ ఆఫీసును తనిఖీ చేసిన జడ్పీ సిఇఓ



చిత్తూరు, నవంబర్ 16 ప్రభాతవార్త: చిత్తూరులోని డిఎల్‌డిఓ కార్యాలయంను బుధవారం జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి కార్యాలయంలోని పలు రికార్డులను తనిఖీ చేసి విఎస్‌డబ్ల్యుఎస్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు, స్పందన గ్రీవెన్స్‌పై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జడ్పీ సిఇఓ మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో సిబ్బంది విధులకు సకాలంలో కచ్చితంగా హాజరు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. విధులకు సకాలంలో హాజరు కాని సిబ్బందిపై అనాథరైజ్డ్ గైర్హాజరుగా గుర్తించి కలెక్టర్ ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఓ రవికుమార్, తవణంపల్లి పూర్వపు ఎంపిడిఓ ధనలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

## అధికార వికేంద్రీకరణతో కొత్త ఆధ్యాయం



చిత్తూరు, నవంబర్ 16 ప్రభాతవార్త: అధికార వికేంద్రీకరణ ద్వారా చారిత్రాత్మక తప్పిదాలను సరిదిద్ధి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో కొత్త అధ్యాయంను సృష్టిస్తున్నారని మేధావులు పేర్కొన్నారు. చిత్తూరు వైకాపా కార్యాలయంలో బుధవారం మూడు రాజధానులు, అధికార వికేంద్రీకరణపై మేధావుల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ రంగాలకు చెందిన మేధావులు పాల్గొని మాట్లాడుతూ మూడు రాజధానులకు మద్దతు తెలిపారు. శ్రీబాగ్ ఒప్పందం మేరకు అప్పట్లోనే పరిపాలనను వికేంద్రీకరించాలని పెద్దలు నిర్ణయించిన విషయంను గుర్తు చేశారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో చెన్నై నగరంతో పాటు ప్రస్తుతం తెలంగాణలోని హైదరాబాదు నగరంను అభివృద్ధి చేసి మనం ఎంతో నష్టపోయామన్నారు. ఇకపై ఇలాంటి చారిత్రాత్మక తప్పులు పునరావృతం కాకుంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుచూపుతోనే కీలక నిర్ణయం తీసుకొందని అభినందించారు. పరిపాలన రాజధానిగా విశాఖపట్నం రాష్ట్ర వికాసానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటు చేయడం వల్ల అన్ని ప్రాంతాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. అలాగే అమరావతిలో శాసన రాజధానిని కొనసాగించడంతో ఆ ప్రాంత అభివృద్ధి జరుగుతుందన్నారు. ఇలా చేయడంతో ప్రజల ఆకాంక్షలకు ఎలాంటి భంగం వాటిల్లదన్నారు. రాజకీయ విద్వేషాలు రగిలించే వారి మాటలకు మోసపోకుండా జాగ్రత్త పడాలన్నారు. రాష్ట్ర విశాల ప్రయోజనాల దృష్ట్యా ప్రజలందరు మూడు రాజధానులకు మద్దతు ప్రకటించాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. అధికార వికేంద్రీకరణకే తమ మద్దతు అని మరోమారు చిత్తూరు నగర మేధావులు స్పష్టం చేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్, చిత్తూరు మండల వైకాపా అధ్యక్షుడు త్యాగరాజు, లీగల్ సెల్ అధ్యక్షుడు సూర్యప్రతాప్, రిటైర్డ్ తహసిల్దారు రెడ్డప్ప, రిటైర్డ్ ఎస్ఐ రెడ్డప్ప, ఎన్జీఓ సంఘ నాయకులు కుమరేష్, రిటైర్డ్ అగ్రికల్చర్ ఆఫీసర్ నాగరాజు, ఆగ్రోస్ డైరెక్టర్ రమణ, నాయకులు శేఖర్, శశిదీప్, వరదరాజులు, విష్ణు, ముస్తాక్, కుమార్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : డిప్యూటీ సీఎం



వెదురుకుప్పం, నవంబర్ 16 ప్రభాతవార్త : రాష్ట్రాభివృద్దే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం నిరంతరం పనిచేయడం జరుగుతుందని రాష్ట్ర డిప్యూటీ సీఎం నారాయణస్వామి స్పష్టం చేశారు. మండలంలోని ఆళ్ళమడుగు పంచాయితీ పరిధిలోని పలు ప్రభుత్వ భవనాలు ప్రారంభించారు. అనంతరం ఆళ్ళమడుగు పంచాయితీ పరిధిలోని పలు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభించారు. సందర్భంగా మహిళలు ఘనంగా హారతులతో స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రజలు సంతోషంగా ఉండటమే లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందని గడప గడపకు సంక్షేమ ఫలాలు అందజేయడం కొరకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గడప గడప కార్యక్రమం రూపకల్పన చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలు, ప్రయోజనాలను ప్రజలను ప్రశ్నించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భారతి, ఎంపీపీ నాగరాణి, జడ్పీటిసి చలం పాళ్యం సుకుమార్, ఎంపిడివో సుధాకర్‌రావు, తహశీల్దార్ పుల్లారెడ్డి, రాష్ట్ర వైసీపీ సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్ రెడ్డి, జిల్లా వైసీపీ కార్యదర్శి కామసాని పద్మనాభ రెడ్డి, నాయకులు బట్టే సుబ్రమణ్యం, రామయ్య, పురుషోత్తం, రోసు రెడ్డి, ధనంజేయులు రెడ్డి, లోకనాధ రెడ్డి,దామోదరం రెడ్డి, సచివాలయం సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాహుకేతు పూజల్లో సినీనటుడు పృధ్వీ



శ్రీకాళహస్తి, నవంబర్ 16 ప్రభాతవార్త బి శ్రీకాళహస్తీశ్వరాలయానికి బుధవారం సినీనటుడు పృధ్వీ విచ్చేశారు. ఆయనకు ఆలయాధికారులు దక్షిణగోపురం వద్ద స్వాగతం పలికారు. ఆలయంలో మహిమాన్వితంగా నిర్వహించే రాహుకేతు పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకుని పూజలు జరిపించుకున్నారు. అనంతరం ఆయనకు ఆలయాధికారులు స్వామి అమ్మవార్ల తీర్ధప్రసాదాలను అందించి వేదపండితుల ఆశీర్వచనాలు అందించారు.



























## అమ్మవారి సేవలో ప్రముఖులు

తిరుచానూరు,నవంబర్ 16 ప్రభాతవార్త: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ లా సెక్రటరీ సత్యప్రకాష్,టిటిడి మాజీ జెఈఓ బసంత్‌కుమార్‌లు వేర్వేరుగా తమ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు.వీరికి ఆలయం వద్ద సూపరింటెండెంట్ శేషగిరి,అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. హైదరాబాద్‌కు చెందిన అమిత్ అగర్వాల్ సుమారు 7 లక్షల రూ॥ల విలువ గల 11 కిలోల 20 వెండి చెంబులను అమ్మవారికి కానుకగా అందచేశారు.వీరికి దర్శనానంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందచేశారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి,ఆలయ ఇన్స్‌పెక్టర్లు దాము,ప్రసాద్,అశోక్,అర్చకులు బాబుస్వామి,తదితరులు పాల్గొన్నారు.

## డెప్యూటీ ఇఓచే ఆకాశదీపం ఆవిష్కరణ

శ్రీకాళహస్తి,నవంబర్ 16 ప్రభాతవార్త : కాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసం సందర్భంగా బుధవారం భక్తి శ్రద్దలతో ఆకాశ దీపాన్ని ఆవిష్కరించారు.ఉదయం నుంచి ఆలయంలో సామాన్య భక్తులు, మరో వైపు విఐపిల తాకిడి పెరుగుతుంది.కోట మండపం వద్ద స్థానిక మహిళా భక్తులు విశేషంగా హాజరు కాగా అలయాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమాల్లో సూపరింటెండెంట్ సురేష్‌రెడ్డి, విజయసారధిలు ఆవిష్కరింపజేసారు. టెంపుల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరాజు, ఇఓ సిసి హరి,దఫేదార్ దాము తదితరులు పాల్గొన్నారు.

## బాణాసంచా పేలుళ్లతో ఏనుగుల తరిమివేత



సదుం, నవంబరు 16 ప్రభాతవార్త బి మండల పరిదిలోని జోగివారిపల్లె పంచాయతీ, చెరకువారిపల్లె పంచాయతీలలో ఉన్న అటవీ సరిహద్దు గ్రామాల వైపు ఏనుగులు వచ్చాయని తెలుసుకున్న గ్రామస్థులు బుధవారం వెళ్లి వాటిని గ్రామాలలోకి, పొలాల్లోకి రాకుండా తరిమివేశారు. అటవీ అధికారుల సహకారంతో స్థానిక సర్పంచి అనిత, వాటర్‌షెడ్‌చైర్మెన్ వెంకటరమణ తదితరులు బాణా సంచాకాల్చి వాటిని దారి మల్లించారు. గత వారం పోతుంవారిపల్లెకు చెందిన పలువురు రైతుల పొలాలను ధ్వంసంచేసిన సంగతి తెలిసిందే.ఇటీవల జోగివారిపల్లె పంచాయతీకి చెందిన ఒక వ్యక్తి ఏనుగు దాడిలోమృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. అదేవిధంగా మరుసటి రెండు రోజులకే విద్యుత్ షాక్‌తో జోగివారిపల్లె పరిసర ప్రాంతాలలో ఏనుగు మృతి చెందింది. అప్పటి నుంచి ఈ వైపు ఏనుగులు రాలేదు. గత వారం నుంచి నాయనివారిపల్లె,బత్తలవారిపల్లె,సీలయ్యగారిపల్లె, ఉప్పరపల్లె, పోతుంవారిపల్లె తదితర ప్రాంతాలలోఏనుగుల అలజడి ఉంది. మంగళవారం రాత్రి ఏనుగులు వచ్చిన సంగతి తెలియడంతో అందరువెళ్లి వాటిని తరిమి వేశారు. ప్రస్తుతం ఏనుగులు లోతుకోన, గుండాల కనుమ వైపు వెళ్లాయి. వైకాపా నాయకుడు ప్రకాష్‌రెడ్డి గ్రామాలలో దండోరా వేయించి ఏనుగుల గురించి హెచ్చరికలు చేయించారు.

## ఇంటింటికి జగనన్న పథకాలు:జనం జేజేలు...గడప గడపకు ఎంఎల్‌ఏ



శ్రీకాళహస్తి రూరల్,నవంబర్ 16 ప్రభాతవార్త : భారత దేశ చరిత్రలో ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి చేపట్టని రీతిలో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికి రూ.5నుంచి పది లక్షలు లబ్ది పొందుతున్నారని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అన్నారు. బుధవారం ఆయన శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలను గోవిందవరం, వికృతమాల సచివాలయం పరిధిలో నిర్వహించారు. ఏ గ్రామానికి వెళ్ళిన ప్రజలు హారతులిస్తూ స్వాగతం పలుకుతున్నారు. మధుసూదనరెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలకు సంబంధించి వాకబు చేశారు.

**ఏర్పేడును ఏ ప్రభుత్వం అయినా పట్టించుకుందా?**

ఏర్పేడు మండలం అభివృద్ధి గురించి ఏ ప్రభుత్వమైనా పట్టించుకుందా? అని ప్రశిస్తూ ముందుకు సాగారు. జగనన్న పాలనలో పరిశ్రమలు, విద్యాసంస్థలు, విమానాశ్రయం అభివృద్ధి,కేంద్ర విద్యాసంస్థలు వచ్చాయన్నారు. వికృతమాల సమీపంలో విమానాశ్రయం వద్ద ఏర్పాటుచేసిన డిక్సన్ పరిశ్రమతో నేడు ఎందరు నిరుద్యోగులు జీవనోపాధి కల్గి ఉన్నారన్నారు. ఈ కార్యక్రమాల్లో మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి జడ్‌పిటిసి తిరుమలయ్య, ఎంపిపి గీత,వైస్ ఎంపిపి జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాసయాదవ్, సింగిల్‌విండో చైర్మెన్ జనార్ధన్ యాదవ్,సర్పంచ్ రుక్మిణి,రామమూర్తి,ఎంపిటిసి రవి,గుర్నాథం, గెరటారెడ్డి,రమణయ్య యాదవ్,ఎస్ ఎస్‌చంద్ర,బత్తిశెట్టి, చలపతి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి కరాటే క్రీడలకు తిరుచానూరు విద్యార్థులు ఎంపిక

తిరుచానూరు, నవంబర్ 16 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్య మరియు క్రీడల సమాఖ్య వారు అండర్–14 జిల్లా స్థాయి కరాటే క్రీడలలో భాగంగా స్థానిక తుమ్మలగుంటలోని ఓ ప్రైవేట్ పాఠశాల వేదికగా జిల్లా స్థాయి కరాటే క్రీడలు చేపట్టారు. ఈ విభాగంలో గెలుపొందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యారు. తిరుచానూరుకు చెందిన చిన్మయ విద్యాలయ విద్యార్థి చరణ్‌తేజ్ మొదటి స్థానంలో, కె.కుసుమసాయిరెడ్డి, అశ్వత్ రెండవ స్థానంలో, ఎన్‌ఆర్ఐ పాఠశాల విద్యార్థులు కరణ్ సాయిరెడ్డి మరియు వెంకట ప్రసన్న ద్వితీయ శ్రేణిలో గెలుపొంది రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ఆంధ్రప్రదేశ్ క్రీడల కార్యదర్శి సురేష్‌బాబు విద్యార్థులను, కరాటే మాస్టర్లు ఇర్ఫాన్ భాషా,ముస్తఫాలను అభినందించారు.

